05ATP28.qxd:05ATP28.qxd 29/10/24 11:02 PM Page 1



## డిఐజిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆనంద్



తాడిపత్రిటౌన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ డిజిపి కార్యాలయంలో అడ్మిన్‌గా బాధ్యతలు చేపట్టిన డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డిని సోమవారం మాల మహానాడు అనంతపురం జిల్లా అధ్యక్షులు సజ్జలదిన్నె ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

డిఐజిని కలిసిన ఆనంద్ ←

## చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ



చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

యాడికి, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలోని కోనఉప్పలపాడు, ఓబులాపురం గ్రామాలకు సంబంధించి ఆర్‌డిటి సంస్థ సహాయంతో 40 లక్షల రూపాయలతో భూగర్భజలాల అభివృద్ధికి చెక్‌డ్యాం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎకాలజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ మురళీధర్, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, సెక్టార్ టీం లీడర్ ఇంజనీర్ బాలాజీనాయుడు, మున్నూరుస్వామి, ఉప్పలపాడు గ్రామ పంచాయతీ సర్పంచు మారికె రామలక్ష్మమ్మ, రామాంజినేయులు, రామకృష్ణ, రాయలసీమ జిల్లాల యువసేన అధ్యక్షులు గండికోట లక్ష్మణ్, ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు నరసింహ, ఉపసర్పంచు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

యాడికి, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండల కేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్రకాలనీలో వున్న అగాపే ఆశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయివరపు నాగరాజు, నాగలక్ష్మి దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు కుటుంబసభ్యులు శశిధర్, ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

## టపాసుల దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

యల్లనూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త



సిఐ సత్యబాబు

మండలంలో ఎవరైనా టపాసుల దుకాణాలు నిర్వహించాలంటే లైసెన్స్ తప్పనిసరి అని రూరల్ సిఐ సత్యబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు, సంబంధిత అధికారుల నుండి తప్పనిసరిగా అనుమతులు పొందిన తరువాత మాత్రమే బాణసంచా అమ్మకాలు చేయాలన్నారు. బాణసంచా షాపులను ప్రజల నివాస ప్రదేశాలకు దూరంగా వున్న బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా తగినంత ఇసుక, నీటి డ్రమ్ములు, అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా బాణసంచా దుకాణాల వద్ద అందుబాటులో వుంచుకోవాలన్నారు. బాణసంచా అక్రమంగా తయారు చేయడం, నిల్వ వుంచడం చట్టరీత్యా నేరమని అట్టి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

## నిల్వ ఉన్న నీటిలో ద్రావణం పిచికారి



నిల్వ వున్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త

పట్టణంలోని 30వవార్డు టీచర్స్‌కాలనీలో దోమల నివారణకు వార్డు కౌన్సిలర్ మల్లికార్జున సోమవారం చర్యలు చేపట్టారు. కాలనీలో వర్షం నీరు నిల్వ వుండడంతో దోమల వ్యాప్తి అధికమైంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని దోమల నివారణకు పారిశుద్ధ్య కార్మికులతో నిల్వ వున్న నీటిలో ఆయిల్ బాల్స్‌తో పాటు ద్రావణం పిచికారి చేయించడంతో పాటు బ్లీచింగ్ చల్లించారు.

## విశేష అలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు



తాడిపత్రిటౌన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి సోమవారం విశేష అలంకరణలో భక్తలకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదే విధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

## లక్షలు విలువ చేసే టపాసులు సీజ్ - సిఐ

యల్లనూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలోని గిరమ్మబావి వద్ద లక్షలు విలువ చేసే టపాసులను సీజ్ చేసినట్లు రూరల్ సిఐ సత్యబాబు తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి. తాడిపత్రికి చెందిన చలపతి, రాజేష్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేశారు. టపాసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు కఠినంగా వ్యవహరిస్తాం

- మున్సిపల్‌చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త

ప్రమాదాల నివారణకు కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమీషనర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, డిష్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలో వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్స్ వుండాల్సిందేనన్నారు. జనవరి 1వతేదీ నాటికి వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్‌లు చేయించుకోవాలన్నారు. ఈ విషయమై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. జనవరి నుండి పూర్తి సిస్టంను మారుస్తున్నట్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని జె.సి వారికి పిలుపునిచ్చారు.

## యాడికిలో మెగా రక్తదాన శిబిరం



సర్టిఫికెట్ అందచేస్తున్న దృశ్యం

యాడికి, అక్టోబర్ 28 ప్రభాతవార్త

పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని శ్రీశివలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సహకారంతో సేవాబ్లడ్ సెంటర్ వారిచే మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, జెసి నారాయణరెడ్డి, ఎంపిటిసిలు అవుకు నాగరాజు, పామిశెట్టి నాగరాజు, ఎస్‌సి సెల్ కన్వీనర్ పందు శ్రీరాములు, చిట్టెంరెడ్డి బాలరెడ్డి, కోటచౌదరి, టైలర్ బద్రి, గుర్రాల కంబగిరి, రాముడు, శివయ్య, యాడికి పోలీసుసిబ్బంది, మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచక్రభీమలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి సోమవారం ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీఅశ్వత్థ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అశ్వత్థానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

## జిల్లాధికారిచే ఎస్.కె.మోదీ స్కూల్‌లో రోబోటిక్ ల్యాబ్ ఉద్ఘాటన



ఎస్.కె.మోదీ పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్‌ను ప్రారంభించి విద్యార్థులచే పరిజ్ఞానం తెలుసుకుంటున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, అక్టోబర్28, ప్రభాతవార్త

నగరంలోని వీరశైవ విద్యావర్ధకసంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్.కె.మోదీ నేషనల్ హైస్కూల్‌లో నూతన రోబోటిక్ ల్యాబ్‌ను జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన నేటి విద్యా వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అత్యావశ్యకమని, నేటి పిల్లలు నూతన సాంకేతిక పరిజ్ఞానం గురించి హెచ్చుగా తెలుసుకోవాలని, ఇందుకు ఈ రోబోటిక్ ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. తాను చదువుకున్న పాఠశాలలో మొదట రాష్ట్ర సిలబస్ ఉండేదని, అనంతరం సీబీఎస్ఈ సిలబస్ పాఠాలు ప్రారంభం కాగా, ఆ పాఠాలను తాను చదువుకున్నట్లు తెలిపారు. చదువుతోపాటు ఇలాంటి ప్రయోగాత్మక జ్ఞానం కలిగించే ప్రాక్టికల్స్ తరగతులు అత్యావశ్యకమని, ఇటువంటి వ్యవస్థను ఈ పాఠశాలలో చేస్తుండడం కళాశాల అధ్యాపకులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. పిల్లలను కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కోరుకోకూడదని, దేశానికి సైన్స్ అంశాల్లో పాల్గొనే విధంగా కూడా తమ పిల్లలను ప్రోత్సహించాలని చెప్పారు. ఈ సందర్భంలో ల్యాబ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులకు మూడో తరగతి చదువుతున్న విద్యార్థి సమన్యు రోబోటిక్ జాకీ పనితీరు గురించి వివరించారు. ఈ ల్యాబ్‌లో 3 నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు పారిశ్రామిక, వ్యవసాయ, ప్రకృతి విపత్తు సందర్భంలో తీసుకునే రక్షణ చర్యలు, ఇతర రంగాల్లో యంత్రాల వినియోగం గురించి ప్రయోగాత్మక యోజనల ద్వారా తెలియపరచడం జరుగుతుందన్నారు. వీ.వి.సంఘం అధ్యక్షులు అల్లం గురుబసవరాజ్ అధ్యక్షత వహించారు. కార్యదర్శి డా.అరవింద్ పాటిల్, యాల్పి మేటి పంపన్నగౌడ, బైలువద్దిగేరి ఎర్రిస్వామి, ఎల్.టి.శేఖర్, హచ్చొళ్లి శరణనగౌడ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ కోతలు మొదలయ్యాయా!

తలుపుల,అక్టోబర్28,ప్రభాతవార్త:

మండల వా ్యప ంగా రాత్రిపూట కరెంట్ కష్టాలు మొదలయినట్లు కనిపిస్తున్నాయి. రాత్రిపూట 2గంటలు 3గంటల తరువాత కరెంట్ పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో దోమలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా దోమలతో జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున రాత్రిపూట కరెంట్ పోకుండా విద్యుత్ సిబ్బంది జాగ్రతలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ముస్లిం మైనారిటీల సమస్యలను పరిష్కరించాలి

-మైనారిటీ సంక్షేమశాఖమంత్రికి ఆల్‌మేవా నాయకుల విన్నపం



రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్‌కు వినతిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఆల్‌మేవా సంఘం సభ్యులు

పుట్టపర్తి, అక్టోబర్ 28,ప్రభాతవార్త

ముస్లిం మైనారిటీల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికికృషి చేయాలని శ్రీసత్యసాయి జిల్లా మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం,ఆల్‌మేవా సంఘం తరఫున రాష్ట్రమైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్‌కు వినతిపత్రం అందించినట్లు ఉమ్మడి జిల్లాల ఆల్‌మేవా సంఘం సభ్యులు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్షులు షక్షావలి, ప్రధనాకార్యదర్శి ఫరూక్‌మహ్మద్, అసోసియేట్ ప్రెసిడెంట్ హిదాయతుల్లా, ఉపాధ్యక్షులు జిలాన్‌బాషా, మహబూబ్‌బాషా,ఆర్థిక కార్యదర్శి దౌలాలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారంనంద్యాలలో జరిగిన ఆల్‌మేవా రాష్ట్ర వార్షిక మహాసభలో ముఖ్యఅతిథులుగా మైనారిటీ,న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్, నంద్యాలపార్లమెంట్ సభ్యులుడా.బైరెడ్డి శబరిలు పాల్గొన్నారన్నారు. ఈ మేరకు సదరు సభలో ముస్లింల అభ్యున్నతికోరకు పలు డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిచాలని వారికి వినతించడం జరిగిదన్నారు. ముఖ్యంగా మైనారిటీలకు ఎస్‌సి,ఎస్‌టిల్లాగా సబ్‌ప్లాన్, వక్ఫ్ అమెండ్మెంట్‌యాక్ట్ రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకించాలని, అన్యాక్రాంతమైన వక్ఫ్‌భూములను స్వాధీనంచేసుకొని మైనారిటీల సంక్షేమానికి వినియోగించాలని, ప్రధాన మంత్రి 15సూత్రాల పథకంను ఆల్మేవా సభ్యులను నియమించి పథకం సక్రమంగాఅమలయ్యేలాచూడాలని, ముస్లింలలో వెనుకబడిన తరగతులకు కేటాయించిన రిజర్వేషన్లను మత రిజర్వేషన్లుగా కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, అలాంటిఅపోహాలను తొలగించాలని, కేంద్ర ప్రభుత్వ నియమకాల్లో ముస్లింలకు ఓబిసి రిజర్వేషన్ అమలు చేయాలని, బడ్జెట్‌లో మైనారిటీలకు సముచిత నిధులు, పిఎంజెవికె కేటాయించబడ్డ భవనాలనుత్వరగా పూర్తీ చేసి అప్పగించాలని, రాష్ట్రంలో ఉర్దూ లెక్చరర్లుగా పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కాంట్రాక్ట్ బేసిక్‌గా మార్చాలని, అధిక సంఖ్యలో విద్యార్థినీ,విద్యార్థులు ఉన్న కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లను నియమించాలని, ఉర్దూ ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలో చాలా యేళ్ళుగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను డి రిజర్వు చేయడం ద్వారా స్పెషల్ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని, ఆల్ మేవా అసోసియేషన్‌కు ప్రస్తుతం ఉన్న రూల్స్‌రిలాక్స్ చేస్తూ స్పెషల్‌గా పరిగణించి జీవో ఎంఎస్ నెంబర్ 264, 22.06.2001కి జిఎ డిపార్ట్‌మెంట్ ద్వారా రికగ్నషన్ ఇవ్వాలని, రాష్ట్ర వక్ఫ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్,ఉర్దూ అకాడమీ,హాజ్‌కమిటీలలో తాత్కాలి భృతిపై పనిచేస్తున్న ఉద్యోగులందరి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, మైనారిటీ ఉద్యోగుల పదోన్నతుల విషంలో ఎలాంటి వివక్ష లేకుండా చర్యలు తీసుకోవాలని, ముస్లిం జనాభా అధికంగా ఉన్నచోట మైనారిటీ స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా ప్రచారకార్యక్రమాలకు ఉర్దూ భాషలో కూడా చేయాలని జివోఎంఎస్ నెంబర్ 151 22.06.2004 యొక్క ఆర్డర్ వల్ల చాలా మంది పోలీస్ శాఖలో ఇతర శాఖలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులువారి సర్వీస్, నియామకం తేదీ నుండి ఇంక్రిమెంట్‌లను కోల్పోయారని,ఉత్తీర్ణత సాధించిన తేదీ నుండి సర్వీస్ ఇంక్ అనుమతించారు కాబట్టి దీనికి సవరణ చేసి వారికిన్యాయం చేయాలని,ఉర్దూ అంగన్‌వాడీకేంద్రాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసినట్లు తెలియజేశారు.

## శ్రీసత్యసాయి జిల్లా డిఆర్‌ఓగా ఎల్.విజయ సారధి



జిల్లా కలెక్టర్‌కు పూలమొక్కను అందిస్తున్న డిఆర్ఓ ఎల్.విజయసారధి

పుట్టపర్తి,అక్టోబర్ 28, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా రాబడి అధికారిగా(డిఆర్ఓ) ఎల్.విజయసారధి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్‌ను ఆయనమర్యాద పూర్వకంగా కలుసుకొని పూలమొక్కను అందించి పరచయం చేసుకున్నారు. ఆయనవిజయవాడలోని ఎపి ఐఐసినందు ఓఎస్‌డిగా పనిచేస్తుండగా ఆయన బదిలీపై శ్రీసత్యసాయి జిల్లా డిఆర్‌ఓగా వచ్చారు. ఇక్కడ డిఆర్‌ఓగా పనిచేస్తున్న కొండయ్యను విజయవాడ జిఎడి నందు రిపోర్ట్ చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.

## కన్నడ చిత్రపరిశ్రమ పట్ల అగౌరవంగా మాట్లాడలేదు

బళ్లారి, అక్టోబర్28, ప్రభాతవార్త



పత్రికాగోష్ఠిలో మాట్లాడుతున్న లక్ష్మికాంత్‌రెడ్డి

కన్నడ చిత్ర పరిశ్రమ గురించి, కన్నడ నటుల గురించి అగౌరవంగా మాట్లాడలేదని స్థానిక నటరాజ్ టాకీస్ యజమాని లక్ష్మికాంతరెడ్డి స్పష్టం చేశారు. సోమవారంనాడు నటరాజ్ థియేటర్ కాంప్లెక్స్‌లో పత్రికాగోష్ఠిలో మాట్లాడిన ఆయన ఇటీవల హైదరాబాద్‌లో పుష్ప-2 సినిమా డిస్టిబ్యూటర్ల సభ జరగగా, అందులో తాను పాల్గొన్నట్లు, పుష్ప-2 సినిమా గురించి మాట్లాడుతూ కేజీఎఫ్ కన్నా హెచ్చు థియేటర్‌లలో కర్ణాటకలో ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పినట్లు, వ్యాపార దృష్ట్యా తాను అలా మాట్లాడడం తప్పేమిలేదని, సోషల్ మీడియాలో దీనిని వక్రీకరించారని, కన్నడిగులకు గానీ, నటుడు యస్ పట్ల అగౌరవంగా ఎక్కడా మాట్లాడలేదని చెప్పారు. తన థియేటర్ కాంప్లెక్స్‌లో ఉమా టాకీస్‌లో కన్నడ సినిమాలు మాత్రమే ప్రదర్శన చేస్తున్నట్లు, అది నేటికీ కొనసాగిస్తున్నట్లు కన్నడ చిత్ర పరిశ్రమ గురించి, కన్నడ నటన గురించి తాను గౌరవంగా, అభిమానంగా ఎల్లప్పుడూ ఉంటానని చెప్పారు. సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమా డిసెంబర్ 5వ తేదీన విడుదల కానున్నదని, ఇది పాన్ ఇండియా సినిమా కాబట్టి కర్ణాటక పంపిణీ హక్కులను ఎన్.సినిమాస్ పొందిందని, అవకాశం ఉంటే కేజీఎఫ్ కన్నా హెచ్చు థియేటర్‌లలో విడుదల చేయడం జరుగుతుందని మాత్రమే తాను చెప్పినట్లు పేర్కొన్నారు. దీని వెనుక ఎటువంటి ఉద్దేశ్యం లేదు. బిజినెస్ పరంగా మాత్రమే తాను మాట్లాడినట్లు తెలిపిన లక్ష్మికాంతరెడ్డి, యస్ నటించిన ఎన్నో సినిమాలను తన థియేటర్‌లలో ప్రదర్శించినట్లు, సౌత్ ఇండియా స్థాయికి కన్నడ హీరోలు ఎదగాలన్న ఆకాంక్ష తనదని చెప్పారు. యస్ అభిమానులు బాధపడేలా తానేమి మాట్లాడలేదని తెలిపిన ఆయన, తానెప్పుడూ కన్నడ చిత్ర పరిశ్రమ నంబర్ వన్ స్థానంలో ఉండాలని కోరుకుంటానని, ఎటువంటి కారణానికి కన్నడ సినిమాల మీద మమకారం చంపుకునేదిలేదని లక్ష్మికాంతరెడ్డి వివరణ ఇచ్చారు.

## మీ రక్తం మరో జీవితానికి ప్రాణం




రక్తదాతలను అభినందిస్తున్న డిఎస్పీ

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 28, ప్రభాతవార్త

అత్యవసర పరిస్థితుల్లో మీరిచ్చే రక్తం మరో జీవితానికి ప్రాణం పోస్తుందని ఎస్సై మల్లికార్జునరెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంసమ్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్సై మల్లికార్జునరెడ్డితో పాటు ఓడీచెరువు మండలానికి చెందిన 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ....అన్నిదానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పది అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణిలకు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారికి, అత యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడిన వారవుతారన్నారు. అయితే రక్తదానం చేయడం వల్ల దాతకు కూడా చాలా ప్రయోజనాలు కలుగుతాయన్నారు. క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల ఐరన్ స్థాయిలో అదుపులో ఉండడమే కాక క్యాన్సర్‌కు గురికాకుండా ఉంటారన్నారు. ఆరోగ్యకరంగా ఉన ్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. పుట్టపర్తి డిఎస్పీ విజయ్‌కుమార్, నల్లమాడ సిఐ నరే ంద్రారెడ్డి, ఎస్సై మల్లికార్జునరెడ్డిలు రక్తదాతలను అభినందించారు.

## రామాలయంలో సీతారాముల కళ్యాణోత్సవం

నంబులపూలకుంట, అక్టోబర్ 28 ప్రభాతవార్త

నంబులపూలకుంట మండలం పడరనడిం పల్లి పంచాయితీలోని కొండలవాల్లపల్లిలో నూతన రామాలయంలో మేళ తాళాలతో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ఆర్మీ అంబులెన్స్‌పై ఉగ్రదాడి

### కాల్పుల్లో ఉగ్రవాది ఒకరు మృతి



**జమ్ము, అక్టోబరు 28:** జమ్ముకాశ్మీర్‌లోని అఖు నూర్ సెక్టార్‌లో ఉన్న వాస్తవాధీన రేఖకు సమీ పంలో ఉగ్రవాదులు ఒక ఆర్మీ అంబులెన్స్‌పై దాడులుచేసారు. ఆర్మీకాన్వాయ్ వెళుతున్న తరుణంలో ఎల్వోసీ వద్ద ఈ కాల్పులుజరిపారు. అయితే ఆర్మీ సిబ్బంది వెంటనే తేరుకుని ప్రతిగా కాల్పులుజరపడంతో ఒక ఉగ్రవాది మరణిం చినట్లు సైనిక అధికారులు తెలిపారు. అంబు లెన్స్‌కు కనీసం డజనుకుపైగా బుల్లెట్లు తగిలి నట్లు పోలీసులు తెలిపారు. జోగ్వాన్ ప్రాం తంలో ఆర్మీ వాహనాలపై కాల్పులు జరపగ డంతో సైనికులు పోలీసుల భద్రతా బలగాలు మొత్తం ఆపరేషన్‌కు దిగాయి. వాస్తవానికి చొరబాట్లు పెరుగుతుండటంతో భట్టాల్‌ప్రాంతం లోని ఖౌర్‌లో సైనికదళాలు ఆపరేషన్ ప్రారం భించాయి. అధికారిక సమాచారం ప్రకారం ఉగ్ర్‌వాదులు ఒక దేవాలయంలో ప్రవేశించి ఒక మొబైల్ కాల్‌కోసం ఎదురుచూస్తున్నారు. ఈ మధ్యలో అంబులెన్స్ వస్తున్నట్లు గుర్తించిన ఉగ్రమూకలు కాల్పులుప్రారంభించారు. గతరాత్రే సరిహద్దుల్లోనుంచి జమ్ములోకి ఈ ఉగ్రవాదులు ప్రవేశించినట్లు తెలుస్తోంది. జమ్ము కేంద్రంగా ఉన్న వైట్‌నైట్ కార్ప్స్ ఆర్మీ ప్రతినిధి మాట్లా డుతూ ఉగ్రవాదులు ఆర్మీకాన్వాయ్ వాహనాలపై కాల్పులుజరిపారని తెలిపారు. ఇందుకు ప్రతిగా కాల్పులుజరిపామని ఎలాంటి గాయాలు లేకుం డా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఉగ్రవా దుల ఏరివేత కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ముగ్గురు ఉగ్రవాదులున్నారని, అస్సాన్ మందిర్‌వద్ద ఉన్నట్లు గుర్తించి అప్రమత్తం అయినట్లు తెలిపారు. ఆర్మీ అంబు లెన్స్‌పై కొన్ని రౌండ్ల కాల్పులు జరిపారని, ఈ ప్రాంతం మొత్తం తమ అధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు ప్రారంభించినట్లు ఆర్మీ ప్రతినిధి తెలిపారు.

## ఖమేనీ ఖాతాను సస్పెండ్ చేసిన 'ఎక్స్'!

**టెహ్రాన్, అక్టోబరు 28:** ఇరాన్‌పై గతవారం ఇజ్రాయెల్ జరిపిన దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఆ దాడుల్లో టెహ్రాన్‌కు భారీ నష్టం కలిగించామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ సుప్రీంనేత అయాతుల్లా అలీ ఖమేనీ తన కొత్త సామాజిక మాధ్యమ ఖాతాలో చేసిన పోస్ట్ చర్చనీయాం శంగామారింది. ఇజ్రాయెల్‌ను బెదిరిస్తూ ఆయన పోస్ట్ చేయడంతో ఆ ఖాతాను రెండు రోజులకే ఎక్స్ సస్పెండ్‌చేసింది. ఇరాన్ సైనిక స్థావరా లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. ఇదిజరిగిన కొన్ని గంటల తర్వాత ఖమేనీ.. హిబ్రూ భాషలో ఓ ఎక్స్ ఖాతాను తెరిచారు. అందులో ఇజ్రా యెల్‌ను హెచ్చరిస్తూ పోస్ట్ చేశారు. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసి జియోనిస్టు పాలన తప్పు చేసింది. ఇరాన్‌కు ఎలాంటి శక్తి, సామర్థ్యం, చొరవ, కోరిక ఉందో మేం చూపిస్తాం అని రాసుకొచ్చారు. దీంతో ఈ ఖాతాను మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్ సస్పెండ్ చేశారు. మరోవైపు ఖమేనీ పేరుతో ఉన్న మరో అధికారికఖాతా యథావిధిగా కొనసాగుతుం డడం గమనార్హం. ఇదిలా ఉండగా ఖమేనీ ఆరోగ్యంఇటీవల క్షీణించినట్లు వార్తలు వచ్చాయి. గత వారం ఆయన తీవ్రమైన కడుపు నొప్పి, జ్వరంతో బాధపడగా ఆయన అధికారిక గృహం లోనే అత్యాధునిక వైద్యసదుపాయాలు అమర్చి ఆయన పేగుకు వైద్యులు శస్త్రచికిత్సచేశారని తెలిసింది. ప్రస్తు తం ఆయన ఆరోగ్యం కొంత మెరుగుపడిందని, విశ్రాంతి తీసుకుంటున్నారని ఇరాన్ మీడియా వెల్లడించింది.

## సల్మాన్‌ఖాన్ వ్యవహారాలకు దూరంగా ఉండు

### ఎంపి పప్పుయాదవ్‌ను బెదిరించిన లారెన్స్ గ్యాంగ్



**ముంబయి, అక్టోబరు 28:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌పై బెదిరింపులు, మహారాష్ట్ర రాజకీయ నేత బాబా సిద్దిఖీ హత్య వంటి కారణాలతో దేశవ్యాప్తంగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు మారుమోగుతోంది. స్వతంత్ర ఎంపి పప్పుయాదవ్‌కు ఆ గ్యాంగ్ నుంచి బెదరిం పులు వచ్చాయని తెలుస్తోంది. బాలీవుడ్ నటు డు సల్మాన్‌ఖాన్‌కు చెందిన వ్యవహారాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారని జాతీయ మీడి యా కథనాలు పేర్కొన్నాయి. హెచ్చరికలు చేసినా పట్టించుకోకుంటే చంపేస్తామని, లారెన్స్ బిష్ణోయ్ గంటలకు రూ.లక్ష చెల్లించి జైల్ సిగ్నల్ జామర్లను నిలిపివేస్తున్నాడని, ఆ తర్వాత యాదవ్‌తో నేరుగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాడని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి పేర్కొన్నట్లు సమాచారం.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్..!

మడకశిర టౌన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త


ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

రొళ్ల మండలం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో అధికారులతో కలిసి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్ క ఆర్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికేనని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలాలకు సంబంధించిన వివిధ సమస్యలపై ఎమ్మెల్యే వినతిపత్రాలను స్వీకరించారు. గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయన్నారు.పింఛన్లు మంజూరు చేయాలని, కొత్త ఇల్లు మంజూరు, ఇళ్ల బిల్లులు అందించాలని, తాగునీరు, సాగునీరు. వన్‌బి, అడంగల్, ఈపాసుపుస్తకం తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా అందించినట్లు తెలిపారు. ప్రజలు అందించిన సమస్యలను పరిశీలించి దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే , మాజీ ఎమ్మెల్సీలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, మారుతి ప్రసాద్, ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిగతుర్పిలో తేదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం

గుడిబండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప

మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షులు భోజరాజు ఆధ్వర్యంలో తెదేపా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కావునప్రతి కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకుని తెలుగుదేశ ంపార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, లాయర్ శివకుమార్, వరప్రసాద్, వెంకటరమణ, మారుతి, మంజునాథ్, క్రిష్ణమూర్తి, నాగలింగప్ప, మూడ్లప్ప, చంద్రప్ప, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితుల భూములపై రియాల్టర్ల కన్ను

- ప్రాణ రక్షణ కల్పించాలని, ఆర్డిఓకి దళితుల మొర

పెనుకొండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కియా పరిశ్రమ రావడంతో ఎర్రమంచి, దుద్దేబండ, గుట్టూరు, పంచాయితీ గ్రామాల్లో, భూ ముల ధరల కోట్లాది రూపాయలు పలకడంతో, భూములపై రియాల్టర్లు కన్ను పడింది. స్థానికంగా ఉపాధి దొరకకపోవడంతో, ఇతర ప్రాంతాలకు వలసలు పోవడంతో, ఇదే అదునుగా భావించిన కొందరు రియాల్టర్లు, దళితుల భూములపై క న్నేసి భూములను నయానా భయానా లాక్కొనేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ సంఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో దుద్దేబండ గ్రామానికి చెందిన మాదిగ గుజ్జారి గాడు వారసులు, గౌరమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మమ్మ, గోపాల్, ముత్యాలమ్మలు, స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిషా ్కర వేదికలో వినతిపత్రాన్ని అందజేశారు.

## వాల్మీకి మహర్షి జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ


వాల్మీకి మహర్షి జయంతిలో పాల్గొన్న ఎంఎల్ఏ, మాజీ ఎమ్మెల్సీ

గుడిబండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండల పరిధిలోని పూజారిపల్లి గ్రామంలో శ్రీవాల్మీకి మహర్షి జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడకశిర ఎంఎల్ఏ ఎంఎస్.రాజు, మడకశిర తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి నేటి తరానికి ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ లక్ష్మీనరసప్ప, కొంకల్లు రామాంజి, నటరాజు, గోవిందరాజు తదితర వాల్మీకి కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాయంత్రం వేళ సమ్మన్నకుంట నిండా కొంగలే..!

- అందరినీ ఆకట్టుకొంటున్న ప్రకృతి అందాలు

ఉరవకొండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త

పట్టణ శివారు లత్తవరం రోడ్డులోగల సమ్మన్నకుంటలో సాయంత్రం అయితే చాలు వందలు, వేల సంఖ్యలో కొంగలు దర్శనమిస్తున్నాయి. ఎక్కడి నుండి వసున్నాయో తెలియదుగాని కుంటలోని నీటిలో, చుట్టూవున్న చెట్లపై తెల్లటి కొంగలు వాలి చీకటి పడే వరకు అక్కడే ఉండి ఆతరువాత ఎగిరిపోతున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడ కొంగల అందాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కాగా సమ్మన్నకుంటలో మురికినీరు మాత్రమే ఉండగా అక్కడ నిలబడి ప్రకృతి అందాలను వీక్షించే అనువైన పరిస్థితులు లేవని స్థానికులు వాపోతున్నారు. కుంటలోకి మురిగినీటిని వదలకుండా ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పంచాయతీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లత్తవరం రోడ్డులోగల సమ్మన్నకుంట నిండా కొంగలు ఉన్న దృశ్యం


## ఉపాధిహామీలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

-తహశీల్దార్ కార్యాలయంలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకుల ధర్నా-రూ.78 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని తేల్చినా చర్యలేవని ప్రశ్న-అవినీతి కోట్లల్లో ఉన్నా అక్రమార్కులను కాపాడుతున్నారని ఆక్షేపణ



తహశీల్దార్ కార్యాలయంలోధర్నా నిర్వహిస్తున్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులు, ఎంపీడీఓ రవిప్రసాద్, ఉపాధి హామీ ఏపీఓలతో మాట్లాడుతున్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, కాంగ్రెస్ పార్టీలో సోమవారం పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక గది ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, మండల ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి ఎన్.మధుసూదన్, రైతు సంఘం సీనియర్ నాయకులు బి.జ్ఞానమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు సోనియా శీనా, ఇంద్రావతి ఓబులేసు, నాయకులు బ్యాళ్ల ప్రసాద్, సుధాకర్ తదితరులు మాట్లాడుతూ మండలంలో గడిచిన ఏడాది కాలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ జరుగగా ఈనెల 22న ప్రజా వేదిక కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం మండలంలో 78 లక్షల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని తేల్చగా కార్యక్రమానికి హాజరైన డ్వామా పీడీ ఇతర అధికారులు మాత్రం కేవలం 9 లక్షల రూపాయలు మాత్రమే రికవరీకు ఆదేశించడంబట్టి చూస్తే జిల్లా అధికారులు సైతం అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేసినట్లు స్పష్టమైంది. అయితే రికవరీ చేయాలని ఆదేశించిన 9 లక్షల రూపాయల్లో ఇప్పటివరకు ఒక్క పైసా కూడా రికవరీ చేయకపోగా ఇదేమని అడిగితే అనుమతికై జిల్లా కలెక్టర్‌కు పంపారని స్థానిక అధికారులు చెబుతున్నారని మండిపడ్డారు. అక్రమ అధికారులను కాపాడాలన్న ఉద్దేశంతోనే ఇదంతా జరుగుతోందని స్పష్టమౌతోందని వాపోయారు. ఈ క్రమంలోనే ధర్నా ప్రదేశానికి ఎంపీపీఓ రవిప్రసాద్ చేరుకోగా వాస్తవాలను, గ్రామాల్లో చోటు చేసుకున్న అవినీతిని ఆయనకు నాయకులు వివరించారు. ఏపీఓ రావాలని పట్టుబట్టగా ఏపీఓ విమల అక్కడికి చేరుకోగా ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో ఆమె సమాధానం చెప్పలేకపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అదే క్రమంలో మండలంలో గడిచిన ఐదేళ్ళ గ్రామాల వారిగా జరిగిన ఉపాధి హామీ పనులపై కూడా విచారణ జరిపి అక్రమాలకు పాల్పడాలంటే అధికారులకు వణుకు పుట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఎంపీడీఓ రవిప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.సిద్దప్ప, కె.వెంకటేషులు, జి.శీనప్ప, బి.రామాంజినేయులు నాయక్, బి.రవికుమార్, వీరాంజినేయులు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం మెరుగు, దోమల నివారణకు చర్యలు చేపట్టండి

-కీటక జనిత వ్యాధుల నియంత్రణ కరపత్రాల విడుదలలో ఎంపిపి, ఎంపిడిఓ


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపిపి, ఎంపిడిఓ తదితరులు

ఉరవకొండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త

పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగు, దోమల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎంపిపి ఎం.నరసింహులు, ఎంపిడిఓ బి.వి. రవిప్రసాద్ సూచించారు. పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో సోమవారం వారు మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.కోదండరామిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ పి.భోగనగౌడ్, ఏవో జి.శుభకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య, ఎంఈఓ హెచ్.ఈశ్వరప్ప కలిసి కీటక జనిత వ్యాధుల నియంత్రణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్బంగా ఎంపిపి, ఎంపిడిఓ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మండలానికి సరిపడా 50 లీటర్ల కిరోసిన్, 25 లీటర్ల పైరిత్రిమ్, 10 లీటర్ల అబేట్, బిటీపీ పౌడర్లను అందించిందని వాటిని వినియోగించి యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో పంచాయతీ కార్యదర్శులు మమేకమై పట్టణ, గ్రామీల్లో సీజినల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపిడీఓ బి.వి.రవిప్రసాద్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి అందరూ బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక క్లాక్ టవర్, ప్రైవేటు బస్టాండు, గుంతకల్లు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారితో మాట్లాడుతూ కూరగాయలు, పండ్లు, ఇతరత్రా వ్యర్థాలను ఇష్టారాజ్యంగా రోడ్లపై పడేయరాదని ప్రతి ఒక ్కరూ చెత్తబుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్

## సమయ పాలన పాటిస్తూ విధులకు హాజరై యూనిఫామ్ తప్పక ధరించాలి

-రాకెట్ల పీహెచ్‌సీ తనిఖీలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబికా దేవి


రాకెట్ల పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇ.భ్రమరాంబికా దేవి

ఉరవకొండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త

వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధినిర్వహణలో ఉన్న సమయంలో తప్పక యూనిఫామ్ ధరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇ.భ్రమరాంబికా దేవి ఆదేశించారు. మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఐపీ, ఓపీ సేవల రికార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, ఇతరత్రా సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. నూతనంగా నిర్మించి భవనాల్లోకి పీహెచ్‌సీను మార్చేందుకుగాను అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమలంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఫార్మసిస్టు మంగమ్మ, ఎల్‌టీ రాణి, స్టాఫ్ నర్సులు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

### పి.కొకుంట్ల పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందికి క్లాస్:

మండల పరిధిలోని పి.కౌకుంట్ల పీహెచ్‌సీను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇ.భ్రమరాంబికా దేవి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లక్ష్మి చందన, సిబ్బందికి క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. వైద్యులతోపాటు సిబ్బంది విధులకు స క్రమంగా హాజరుకాకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవలి కాలంలో పిర్యాదులు అధికం కావడంతో డీఎంహెచ్‌ఓ తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు సమాచారం.

## జనానికి ఇచ్చే జాగాలను నాటి పాలకులు కబ్జా చేశారు

- ప్రజాదర్బార్‌లో మంత్రికి ఫిర్యాదు చేసిన జనసేన జిల్లా కార్యదర్శి సురేష్

గోరంట్ల, అక్టోబర్ 28 ప్రభాతవార్త


మంత్రికి ఫిర్యాదు చేస్తున్న జనసేన జిల్లా కార్యదర్శి

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో సర్వేనెంబర్ 272-2 మరియు, 4లోని 4 ఎకరాల్లో ప్రభుత్వ లేఅవుట్‌లో గత ప్రభుత్వ హయాంలో విలువైన స్థలాలను కాజేందుకు నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి కొందరు స్థలాలు కబ్జా చేశారని మరికొందరు ఏకంగా గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేశారని అప్పట్లో ప్రశ్నించినందుకు ఏకంగా దాడులు చేశారని అలాంటి ప్రభుత్వ లేఅవుట్‌పై సమగ్ర విచారణ జరిపి విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని మంత్రి సవితమ్మకు ప్రజాదర్బార్‌లో జనసేన జిల్లా కార్యదర్శి సురేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటికే ప్రస్తుత తహశీల్దార్ గతంలో విధులు నిర్వహించిన తహశీల్దార్ గాని ఈ ప్రభుత్వ లేఅవుట్‌లో 17 మందికి మినహా ఎవరికి తహశీల్దార్ కార్యాలయం నుండి పట్టాలు మంజూరు చేయలేదని, అయితే కొందరు హైకోర్టును ఆశ్రయించారని, దానికి స్పందనగా హైకోర్టుకు సైతం వాస్తవ విషయాలు తెలియచేశామని అధికారులు ఇప్పటికే స్పష్టం చేసినట్లు మంత్రి దృష్టికి సురేష్ తీసుకొచ్చారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన మంత్రి తప్పకుండా అధికారులతో విచారణ జరిపి ప్రభుత్వ స్థలాలను కాపాడుతామని ఆమె హామీ ఇచ్చారు.

## కౌన్సిల్‌మీట్‌ను బహిష్కరించిన చైర్మన్, కౌన్సిలర్లు

గుత్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త


సమావేశం బహిష్కరించిన దృశ్యం

గుత్తి మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్‌మీట్‌ను చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు అధికారుల తీరుకు నిరసనగా బహిష్కరించారు. చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన సమావేశం ప్రారంభించగానే ఎస్ఎస్‌పి 15వ గ్రాంట్ నిధులను వినియోగంపై నూతనంగా అంచనాలు రూపొందిచేందుకు అధికారులు ప్రతిపాదించారు. అయితే తమ వార్డుల్లో ప్రోటోకాల్ పాటించకుండా అధికారులు ఇష్టారాజ్యంగా పనులు చెబుతున్నారని తమకు సమాచారం ఇవ్వడంలేదని కౌన్సిలర్లు ఆరోపించారు. అభివృద్ధికి తాము సహకరిస్తామని అయితే తమకు ఎలాంటి విలువ ఇవ్వడం లేదని వారు వాపోయారు. అనంతరం నిరసన వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కమీషనర్ జబ్బార్‌మియా, డిఇ హేమచంద్ర, మేనేజర్ రాంబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు వినతుల వెల్లువ

గుంతకల్లు, అక్టోబర్ 28 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి గుంతకల్లుకు వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు వివిధ పార్టీలు, ప్రజా, దళిత సంఘాల నాయకులు సోమవారం వినతులు అందచేశారు. పట్టణంలోని స్పిన్నింగ్‌మిల్ ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు, ఒంటరి మహిళలకు తెల్లరేషన్‌కార్డు, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధులు విడుదల చేయాలని బిజెపి పట్టణాధ్యక్షులు వడ్డే రమేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీలో ఇతరులను సభ్యులగా నియమించారని ఆ నియామకాన్ని రద్దు చేయాలని దళిత సంఘం నాయకులు మహేంద్ర, భీమలింగ, కోరి చంద్రశేఖర్, ఎర్రిస్వామి, తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని చెరువుల్లో పూడిక తీయించి తాగు, సాగునీరు అందించాలని సిపిఎం పార్టీ నాయకులు బి.శ్రీనివాసులు, కసాపురం రమేష్ కలెక్టర్‌ను కోరారు. స్పిన్నింగ్ మిల్ వద్ద టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని డివైఎఫ్‌ఐ నాయకులు సరేంద్రబాబు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి రాముదాయల్, నాయకులు ఈశ్వరయ్య, గురుస్వామి కలెక్టర్‌కు విన్నవించారు. నియోజకవర్గం వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్‌కుమార్, కసాపురం, గుంతకల్లు ప్రాంతాల్లో నివాసం వుంటున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, దళిత జనసేవా సంఘం నాయకులు రామాంజినేయులు, చిన్నా కలెక్టర్‌కు విన్నవించారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

## కె.శివరం చెరువులో చేపల పెంపకం కొరకు వేలంపాట

- రూ.4.86 లక్షల ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలోని కె.శివరం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుల్లో చేపల పెంపకం కొరకు సోమవారం బహిరంగవేలంను గ్రామ పంచాయతీ సర్పంచు మంజులచిత్తన్న అధ్యక్షతన ఇఓఆర్‌డి నాగముని సమక్షంలో గ్రామ కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేలంపాట ద్వారా సున్నకల్లుహట్టి రమేష్ 3.73 లక్షలకు, పేలుబండ చెరువులో చేపల పెంపకం కొరకు పేలుబండ రమేష్ 80 వేలకు, నాగవనపల్లి చెరువులో చేపల పెంపకం కొరకు రంగస్వామి 33 వేల రూపాయలకు వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. చెరువులో చేపల పెంపకం వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీకి 4.86 లక్షల ఆదాయం సమకూరినట్లు గ్రామ పంచాయతీ సర్పంచు మంజులచిత్తన్న, గ్రామ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపిపి కృష్ణమూర్తి, మాజీ సర్పంచు ఈరన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్ అందుకున్న తహశీల్దార్

గుంతకల్లు, అక్టోబర్ 28 ప్రభాతవార్త


ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్ అందుకుంటున్న తహశీల్దార్ రమాదేవి

స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా తహశీల్దార్ రమాదేవి అందుకున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి అయినా ఐఎస్ఓ గుర్తింపు లభించాలంటే 39 రకాల ప్రమాణాలు అవసరమని ఆమె తెలిపారు. ఐఎస్ఓ ప్రతినిధులు ఇక్కడికి వచ్చి ప్రమాణాలు పరిశీలించి గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఐఎస్ఓ గుర్తింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఐఎస్ఓ గుర్తింపు పొందడం ఆనందంగా వుందని తహశీల్దార్ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, డిప్యూటి తహశీల్దార్ నారాయణస్వామి, రీ సర్వే డిప్యూటి తహశీల్దార్ షెక్షావలి, ఆర్ఐ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

గుత్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త

గుత్తి మున్సిపల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికులకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, ఈశ్వరయ్య, రాజశేఖర్, రత్నాలు, రామాంజినేయులు, శ్రీనివాసులు, నాగేంద్ర, వినయ్, ఇంజనీరింగ్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షులు రాజు, మురళి, ఆది, నరసింహ, రవి, నక్క శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం

మడకశిర అక్టోబర్ 28 ప్రభాతవార్త;


రక్తదానం చేస్తున్న పోలీసులు

పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపిఎస్ ఆదేశాల మేరకు పట్టణంలోని యాదవ కళ్యాణమంటపంలో పెనుకొండ డిఎస్పీ వై.వెంకటేశులు ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని డిఎస్పీ సందేశాన్ని ఇచ్చారు. రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారనం ఆయన అన్నారు. ఈ రక్తదానం శిబిరంలో 15 మంది పోలీస్ సిబ్బంది, 80 మంది యువత రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్ గుండుమల తిప్పేస్వామిలు రక్తదానం చేసిన దాతలకు పండ్లు మరియు పండ్ల రసాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలీసులు త్యాగ మూర్తులని వారి సేవలు మరువలేనివని అన్నారు. ప్రజలు కోసం జీవితాన్ని త్యాగం చేసే ఏకైక వ్యక్తి పోలీస్ మాత్రమే అని అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాలు ఎంతో హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు రామారావు, రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, పోలీస్‌సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు మరియు నియోజకవర్గంలోని యువతి యువకులు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి మరియు డాక్టర్ అనిల్, చిట్టిబాబు, వైద్యసిబ్బందికి ప్రజలకు మడకశిర పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా జరిగిన స్వాగతోత్సవ వేడుకలు

ధర్మవరం రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త


మాట్లాడుతున్న కరస్పాండెంట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యాలు

పట్టణంలోని ఎల్సీ సర్కిల్‌లో గల శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో స్వాగతం వేడుకలుఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, కరస్పాండెంట్ జగదీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెజిబివి అధ్యాపకురాలు హరిని, మోడల్ కాలేజ్ అధ్యాపకులు కిరణ్ పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. సీనియర్, జూనియర్ విద్యార్థినీలు కలిసి, మెలిసి ఐక్యమత్యంగా సమన్వయంతో చదువును కొనసాగించాలని తెలిపారు. అలాగే సీనియర్ విద్యార్థినీలు, జూనియర్ విద్యార్థినీలకు ఆదర్శంగా ఉండేవిధంగా మలుచుకోవాలన్నారు. ఈ మధ్య విడుదలైన ఎస్కేయూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాల్లో టౌన్ ఫస్ట్ సాధించిన విద్యార్థినీలను మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ విజయానికి కృషిచేసిన అధ్యాపకేతరబృందాన్ని అభినందన కృతజ్ఞతలను తెలిపారు. మున్ముందు కూడా ఈ కళాశాలకు మంచి విజయాన్ని చేకూర్చాలని వారు కోరడం జరిగిందన్నారు. తదుపరి విద్యార్థినీలు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.అధ్యంతరంస్వాగతం శుభవేడుకలుఉత్సాహంగా ముగిశాయి.

09ATP27_09ATP27.qxd 28-10-2024 PM 10:54 Page 1






# విజయపుర జిల్లాలో రైతుల భూముల సేకరణకు వక్ఫ్‌మండలి ఎలాంటి నోటీసులు జారీ చేయలేదు

**- రెవెన్యూమంత్రి కృష్ణ బైరేగౌడ**



విలేకరులతో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ తదితరులు.

**బెంగళూరు,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

విజయపుర తాలూకాలోని హొనవాడ గ్రామంలో రాష్ట్ర వక్ఫ్‌మండలికి కేవలం 12ఎకరాల భూమి మాత్రమే ఉందని ఈ మండలి ఏ ఒక్క రైతుల జమీను సేకరించేందుకు నోటీసులు ఇవ్వలేదని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ స్పష్టీకరించారు.అచ్చుతప్పుల వలన సర్కారు గెజిట్‌లో హొనవాడలో వక్ఫ్ మండలికి 1200 ఎకరాల భూమి ఉందని అచ్చుకావటంతో రైతులు భయభీతులయ్యారని మంత్రి చెప్పారు.సర్కారు గెజిట్ నోటిఫికేషన్‌లో దొర్లిన తప్పులను సరిచేసుకుంటామని చెప్పారు.హొనవాడ రైతులు ఎలాంటి భయాలకు లోనుకావద్దని కోరారు.రైతులకు నోటీసులు పంచారని వచ్చిన ఆరోపణలను ఎవ్వరూ నమ్మవద్దని మనవి చేశారు.ఒకవేళ ఎవరికైనా నోటీసులు అందితే వాటిని పట్టించుకోవద్దని కోరారు.సర్కారు హొనవాడ రైతులకు అండగా నిలబడుతుందని తెలిపారు.దీంట్లో జరిగిన పొరపాట్లును సరిచేసుకుంటామని తెలిపారు.ఇలాంటి అచ్చుతప్పులు జరిగిన దానికి సర్కారు విచారం వ్యక్తం చేస్తుందని తెలిపారు.హొనవాడలో ఉన్న రైతుల భూములకు కూడా ఇండీకరణ చేస్తామని తెలిపారు.గతంలో రైతులకు మంజూరైన భూములను సర్కారు వాపస్ తీసుకోదని తెలిపారు.రైతులు అనవసరమైన ఆందోళన చెందకూడదని కోరారు. మంత్రితో పాటు విజయపుర జిల్లా ఇంఛార్జీమంత్రి ఎంబి.పాటిల్ ,వక్ఫ్‌శాఖ మంత్రి జమీర్ అహమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# దావణగెరె జిల్లాలో ఎస్బీఐ బ్యాంకులో చోరీ

**-కోట్లాది విలువచేసే బంగారు నగలు నగదు దోచుకున్న చోరులు**

**దావణగెరె, అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**



దావణగెరెజిల్లా న్యామతి పట్టణంలో చోరీ జరిగిన ఎస్‌బిఐ బ్యాంకు

దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకాలోని న్యామతి పట్టణంలో గుర్తు తెలియని దుండగులు అక్కడి ఎస్‌బిఐ బ్యాంకు కిటికీ ఊచలు విరగ్గొట్టి కోట్లాది రూపాయల విలువైన బంగారు ఆభరణాలను నగదు దోచుకుని పరారయ్యారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎస్‌బిఐ బ్యాంకు ఆదివారం శలవురోజు కావటంతో చోరులు పథకం ప్రకారం రాత్రి ఇక్కడకు వచ్చి బ్యాంకు వెనుకవైపు కిటికీ ఊచలు కోసివేసి బ్యాంకులోనికి జొరబడి లాకర్లలో ఉన్న ఆభరణాలను నగదును దోచుకుని పరారయ్యారు.బ్యాంకులోని సిసిటివి డివిఆర్ కూడా దోచుకుని పరారయ్యారు. సోమవారం బ్యాంకు పనిచేసే సమయానికి వచ్చిన సిబ్బంది బ్యాంకు తాళాలు తీసి లోనికి వెళితే బ్యాంకులో చోరీ జరిగిన విషయాన్నిగుర్తించి వెంటనే పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వ్రేలిముద్రల టీములు మరియు డాగ్‌స్క్వాడ్‌లతో వచ్చి సోదాలు చేశారు.కర్ణాటకలో నాలుగో శనివారం సర్కారు శలవు రోజు కావటం ఆదివారం పబ్లిక్ హాలిడే కావటంతో దుండగులు సమయం చూసుకుని ఈ బ్యాంకుపైన దాడి చేసి నగదు నగలు దోచుకుని పరారయ్యారు.

# బెంగళూరు నగరంలో ప్రమాదకరమైన కట్టడాలను కూల్చివేసేందుకు బిబిఎంపి డ్రోన్‌సర్వే షురూ

**బెంగళూరు, అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరంలో కురిసిన భారీ వానలకు పలుచోట్ల పలు అంతస్తుల బిల్డింగులు పక్కకు వాలిపోవటంతో ప్రమాదాన్ని గ్రహించిన మహానగరపాలికె నగరంలో ఎక్కడెక్కడ అక్రమంగా భారీ అంతస్తుల కట్టడాలను ప్లాన్‌లేకుండా నిర్మించారో అక్కడ ఆయా బిల్డింగుల వివరాలను సేకరించేందుకు బెంగళూరు మహానగరపాలికె వివిధజోన్లలో 70మంది అధికారులను నియమించి సర్వేను ప్రారంభించింది.ఈమేరకు బిబిఎంపి కమిషనర్ తుషార్ గిరినాథ్ బెంగళూరులో ఆక్రమణలకు గురైన రాజకాలువలు, సర్కారు పాదచార మార్గాలు గురించి సర్వే జరిపి వాటి స్థితిగతుల గురించి సర్వే చేయాలని అధికారులను సోమవారం కోరారు.వీటితో పాటు పాలికె అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తుల కట్టడాల తాజా పరిస్థితుల పట్ల డ్రోన్ సర్వే మరియు శాటిలైట్ సర్వే చేయించాలని ఆదేశించారు.ఇటీవల బాబుసా పాళ్యలో ఆరు అంతస్తుల బిల్డింగ్ కూలిపోయి 9మందిని పొట్టన పెట్టుకోవటంతో మేల్కొన్న బెంగళూరు మహానగర పాలికె అధికారులు ఇలాంటి దుర్ఘటనలు ఎక్కడా జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.బెంగళూరులో అక్రమ కట్టడందార్ల భరతం పట్టేందుకు బిబిఎంపి దిట్టమైన చర్యలు తీసుకోవాలని బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి డికె.శివకుమార్ పాలికె అధికారులను ఆదేశించటంతో అధికారుల్లో చలనం కలిగింది.

# బెంగళూరు నగరంలో పెరిగిపోతున్న ద్విచక్రవాహనాల చోరీలు

**బెంగళూరు,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరరోడ్లపైన నిత్యం కోటి ఎనిమిదిలక్షల ద్విచక్రవాహనాలు సంచరిస్తుంటే వీటి సంఖ్యకు అనుగుణంగానే నగరంలో నిత్యం ద్విచక్రవాహనాల చోరీలు కూడా జరుగుతున్నాయి.ఒకలెక్క ప్రకారం నగరంలో నిత్యం 15 మోటారుసైకిళ్లు వంతున చోరీలు జరుగుతున్నట్లు సమాచారం.నగరంలో ఆదరాబాదరాగా వాహనాలపైన సంచరించే చోదకులు వాటిని కనిపించిన చోటల్లా పార్కింగ్ చేసి తమ సొంత పనులమీద వెళుతుండటంతో వాహనచోరులు ఇదే అవకాశంగా తీసుకుని మోటారుబైకులను ఎత్తుకుపోతున్నారు.యాంత్రీకమయమైన బెంగళూరు నగర జీవనంలో బైకుల దొంగతనాలు కూడా నిత్యకృత్యంగా మారాయి.వాహనాల ఓనర్లు అజాగ్రత్త ,బైకులను పార్కుచేసిన హడావుడిగా వాటి తాళాలకు అక్కడే వదిలివేసి వెళుతుండటం కూడా బైకుల చోరీలకు అవకాశం కల్పించింది.ఈమధ్యలో బైకుల తాళాలను నేర్పుగా విరగ్గొట్టే గ్యాంగులు సక్రియంగా పనిచేస్తుంటం వలన వాహనాల చోరీలు సర్వసాధారణంగా మారాయి.గత రెండు సంవత్సరాల్లో బెంగళూరులో 2576 ద్విచక్రవాహనాలు దొంగతనానికి గురయ్యాయి.నగర రోడ్లపక్కనే రాత్రిళ్లు ద్విచక్రవాహనాలను నిలిపివేయటం మరియు కార్లను కూడా ఆయాచోట్ల నిలిపివేస్తుంటంతో బైక్ చోరీలకు అవకాశం లభించింది.బెంగళూరులో రాత్రి గస్తులో ఉండే పోలీసులు ఎన్నివేల వాహనాలకు రక్షణ కల్పిస్తున్నారో ఊహించుకుంటే ఇపుడున్న పోలీసుల సంఖ్య ఏమాత్రం చాలదు.దీంతో పేట్రేగిపోతున్న బైకుచోరులు ఓనర్లు ఏమరుపాటుగా ఉంటే వాటిని తస్కరించి బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

# హాసన్ పట్టణంలో హాసనాంబదేవి దేవాలయానికి పోటెత్తిన భక్తులు

**- మూడురోజుల్లో 3కోట్లకు పైగా కానుకల రాక**

**హాసన్,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**



హాసనాంబదేవికు పూజలు చేయిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య.

హాసన్ పట్టణంలో ఏటా ఒకసారి మాత్రమే తెరుచుకునే హాసనాంబదేవి దేవాలయంలో దేవీ దర్శనం కోసం భక్తులు సోమవారం పోటెత్తారు. కిలోమీటర్ల వరకు బారులు తీరిన భక్తులు హాసనాంబ దేవిని దర్శించుకుని దేవి ఆశీర్వాదం పొందటానికి లైన్లలో నిలబడ్డారు. గత మూడు రోజులుగా ఈ దేవాలయానికి వేలాదిమంది భక్తులు వచ్చి దేవిని దర్శించుకుని కానుకల రూపంలో మూడుకోట్ల రూపాయలకు పైగా సొమ్ముని ముడుపుల రూపంలో సమర్పించుకున్నారు.ఈదేవాలయంలో హాసనాంబదేవి ఉత్సవం రోజున వెలిగించిన దీపం ఏడాదిపాటు దేవాలయంలో వెలుగుతూనే ఉంటుందని భక్తుల నమ్మకం. దేవాలయాన్ని మూసివేసేటపుడు దీపం వెలుగుతున్న సందర్భాన్ని చూసే భక్తులు మళ్లీ ఏడాది తరువాత అక్టోబర్ నెలలో జరిగే దేవాలయం ఉత్సవం రోజు వరకు కాచుకుని ఉంటారు.ఈనమ్మకం చేత ఈదేవాలయానికి ఏటేటా వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుంది.హాసనాంబదేవి ఉత్సవాల్లో కర్ణాటక తమిళనాడు,ఆంధ్రప్రదేశ్ తెలంగాణ,కేరళ గోవా పొరుగు మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చి దేవిని దర్శించుకుంటున్నారు.ఇవాళ కర్ణాటక సిఎం సిద్దరామయ్య, కేంద్రమంత్రి వి.సోమణ్ణ తదితరులు హాసనాంబదేవిని దర్శించుకుని పూజలు జరిపారు.

# మండ్యజిల్లాలో యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్న యువకుడిని హత్యచేసిన స్నేహితులు

**మండ్య,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్యజిల్లా పాండవపుర తాలూకా చినకురళి గ్రామంలో ఆదివారం రాత్రి ఒక యువకుడి హత్య జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చినకురళి గ్రామానికి చెందిన అరవింద (24) అనే తాపీ కార్మికయువకుడు తన స్నేహితులతో కలసి రాత్రి తాగేందుకు బార్‌కువెళ్లాడు.మందుమైకంలో ఇతడు మరో స్నేహితుడి పెళ్లాంతో అక్రమ సంబంధం పెట్టుకున్నానని చెప్పటంతో విజయ్ అనే స్నేహితుడు సుత్తితో తలపైన బాది హత్య చేశాడు. అరవిందను ఏళుమళై,విజయ్ అనే స్నేహితులు హత్య చేసిన సమాచారంతెలుసుకున్న పోలీసులు గ్రామానికి వచ్చి ఇద్దరు యువకులను అరెస్టు చేశారు.యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్నందుకు తాము అరవింద్‌ను హత్య చేసినట్లు ఇద్దరు యువకులు పోలీసుల ముందు నేరాన్ని అంగీకరించారు.

## తుమకూరు జిల్లాలో చెరువు కందకం పడిపోయిన యువతిని రక్షించిన పోలీసులు

**తుమకూరు,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

తుమకూరు జిల్లాలోని క్యాత్సంద్ర ఏరియాలో ఉన్న మందారకెరె ప్రాంతం చెరువు అందాలను మొబైల్‌లో చిత్రీకరించాలని వెళ్లిన గుబ్బితాలూకాకు చెందిన హంస అనే యువతి మందారకెరె చెరువు అందాలను సెల్ఫీలో తీసుకుంటుండగా కాలుజారి చెరువు అడంగుల వద్ద కొట్టుకుపోయింది.ఈసంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది.అయితే యువతి చెరువులో కాలుజారి పడిపోయిందని యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేయటంతో పోలీసులు ఆదివారం రాత్రి వరకు చెరువులో వెతుకులాడారు.తిరిగి సోమవారం ఉదయం కూడా ఈతగాళ్ల సాయంతో చెరువును గాలించగా సదరుయువతి చెరువు అడంగుల్ వద్ద ఉన్న కందకం గుంతలో చిక్కుకుని పోయి ఉండటాన్ని గమనించి రెస్క్యూ చేసి కాపాడారు.దీంతో యువతిని క్షేమంగా పైకి తీసుకువచ్చారు.

## రామనగర పట్టణంలో గనులశాఖ ఆవరణలో చెట్టుకు ఉరేసుకున్న లారీ డ్రయివర్ ఆత్మహత్య

**రామనగర,అక్టోబర్ 28,ప్రభాతవార్తప్రతినిధి**

రామనగర పట్టణంలో సోమవారం ఒక లారీ డ్రయివర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మాగడికు చెందిన నాగేశ్ (45) సోమవారం అక్రమంగా జెల్లీ క్రషర్ నుంచి చిప్‌జల్లీ కంకరరాళ్లను తరలిస్తుండగా గనులశాఖ సోదా జరిపి పట్టుకుంది. ఆతరువాత అధికారులు సదరు జల్లిక్రషర్ ఓనర్‌కు నోటీసులు ఇచ్చింది.లారీను నడిపిన డ్రయివర్ తన క్రషర్‌ఓనర్‌కు నోటీసు ఇవ్వలేక మదనపడి గనులశాఖ అధికారులు నానారకాలుగా విచారణ జరుపుతారని భయపడి గనులశాఖ కార్యాలయం ఉన్నఆవరణలో ఒక చెట్టుకు పగ్గంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈమేరకు రామనగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

# ముడాకేసులో మాజీ కమిషనర్ల నివాసాలపైన ఇడి దాడులు

**మైసూరు,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార నుంచి జరిగిన అక్రమ సైట్ల పంపిణీ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న ఇడి అధికారులు సోమవారం ముడాకు చెందిన మాజీ కమిషనర్లు మరో 8మంది అధికారుల నివాసాలపైన హఠాత్తుగా దాడులు జరిపి సోదాలు నిర్వహించారు.సోదాల సమయంలో పెద్దఎత్తున అక్రమ ఆస్తులు దాఖలాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఇప్పటికే ఇడి అధికారులు ముడా కార్యాలయంపైన రెండురోజుల పాటు దాడులు నిర్వహించి వేలాది పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.ముడా కర్మకాండలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుటుంబానికి చెందిన ఏమైనా రికార్డులు లభిస్తాయా అనే కోణంలో దాడులు కొనసాగిస్తున్నారు.ముడా ముఖ్యమంత్రి సతీమణికి మంజూరు చేసిన 14నివేశనాల రికార్డు కనిపించటంలేదని సామాజిక కార్యకర్త గంగరాజు చేసిన ఆరోపణల పట్ల ఇడి అధికారులు ఇవాళ బెంగళూరు కార్యాలయానికి గంగరాజుని పిలిపించి సుదీర్ఘంగా విచారణ జరిపారు.

## ముఖ్యమంత్రికి దీపావళి కానుకగా సంజీవని పథకం స్వసహాయబృందాల ఉత్పత్తులను అందించిన మంత్రి మధు బంగారప్ప

**బెంగళూరు,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**



బెంగళూరులో సంజీవని పథకం ఉత్పత్తులను కానుకగా సిఎంకు అందజేస్తున్న మంత్రి మధుబంగారప్ప.

దీపావళి పండుగను పురస్కరించుకుని శివమొగ్గ జిల్లా పంచాయతీ అక్కడి సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల మహిళలు ఉత్పత్తి చేసిన హోంమేడ్ ఉత్పత్తులను సిఎంకు సోమవారం కానుకగా అందచేశారు. విద్యా శాఖ మంత్రి మధు బంగారప్ప నాయకత్వంలో సిఎం నివాసం కావేరిలో సిద్దరామయ్యను కలుసుకున్న మహిళా సంఘం నాయకులు సిఎంకు కానుకలు అందచేశారు.శివమొగ్గ జిల్లాలో సంజీవని పథకంలో సర్కారు సాయంతో వందలాది స్వసహాయ మహిళా బృందాలు పనిచేస్తుంటే వీరంతా ఏటా కోట్లాది రూపాయల టర్నోవరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారు.ఈసారి తమ ఉత్పత్తులను కానుకల రూపంలో సిఎంకు అందచేసి సిఎం చేసిన సాయానికి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

# అన్ని గ్రామాలకు ఉపాధి హామీ పనులు కల్పించండి



మాట్లాడుతున్న అడ్మినిస్ట్రేషన్ అధికారి తిప్పయ్య

**కంబదూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ జేఏసి మండల అధ్యక్షుడు డాబా రమేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికార తిప్పయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని గ్రామాలలో ఉపాధిహామీ పనులు కల్పించకపోవడంతో నిరుపేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున అధికారులు ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసి ఎస్సీ, ఎస్టీ జేఏసి మండల ఉపాధ్యక్షులు గోపాల్, నరసింహులు, తిమ్మరాయుడు, హనుమంతు పాల్గొన్నారు.

# బాలికల భద్రత సామాజిక బాధ్యత కార్యక్రమంపై అవగాహన

**కంబదూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని పాళ్లూరు గ్రామం లో ప్రభుత్వ శాకల సమన్వ యంతో ఆర్డిటి సంస్థ మహిళా విభాగపు టీం లీడర్ ఆదినారా యణ అధ్యక్షతన బాలికల భద్రత సామాజిక బాధ్య త అనే అంశంపై సోమవారం గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రామసభకు కంబదూరు ఐసిడిఎస్ సిడిపిఓ వనజా అక్కమ్మ ముఖ్య అతిథిగా హాజరై బాలల పరిరక్షణ హక్కుల పట్ల క్షుణ్ణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిస్తే 1098, 112 నెంబర్లకు సమాచారం తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి ప్రదానోపాధ్యాయులు నరసింహమూర్తి, మహిళా పోలీస్ ఇంద్ర యాదవ్ అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## బెంగళూరు తితిదే వారిచేత కొత్తక్యాలండర్లు డైరీలు అందుబాటులో

**బెంగళూరు,అక్టోబర్ 28,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు వయ్యాలికావల్‌లోని తిరుమల తిరుపతి దేవాలయం ఈనెల 30న దేవాలయం ఆవరణలో 2025 సంవత్సరపు నూతన సంవత్సర క్యాలెండర్లను డైరీలను విడుదల చేయనుంది.అదేరోజు మధ్యాహ్నం నుంచి భక్తులకు ఇవి అందుబాటులోనికి వస్తాయని తితిదే శాఖ అధికారులు సోమవారం తెలియజేశారు.

## బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

**అగళి, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



బ్యాంకులో విషయాలను తెలుసుకుంటున్న విద్యార్థుల దృశ్యం

ఆదర్శ పాఠశాలలో 9, 10, ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సు చదువుతున్న ఐటిఈఎస్ చదువుతున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్లఓ భాగంగా, మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కర్ణాటక బ్యాంకును సందర్శించడం జరిగింది. స్కూల్‌లో కంప్యూటర్ థియరీ నేర్చుకున్న విద్యార్థులు ప్రాక్టికల్ వర్క్‌లో భాగంగా బ్యాంకు ఉద్యోగులతో విషయాలను తెలుసుకున్నారు. ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా ట్రైనింగ్ అనుభవం నాలెడ్జ్ పెంపొందుతుంది. ఇలాంటి కంప్యూటర్ కోర్సు అగళి ఆదర్శ పాఠశాలలో ఉండటంతో విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది ఉంటుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాఫర్, ఒకేషనల్ టీచర్ చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

**-తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు వ్యక్తుల పరిస్థితి విషమం**

**-అనంతపురం-బళ్లారి 42వ నవంబర్ జాతీయ రహదారిలో ఘటన**

**ఉరవకొండ, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామాంజినేయులు

పట్టణ శివారు బూదగవి గ్రామానికి సమీపంలో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నార్పలకు చెందిన రామాంజినేయులు (40) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ప్రమాదంలో బుక్కరాయసముద్రం మండలం రేగడికొత్తూరు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, ఓబేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. బొలేరో, ద్విచక్రవాహం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంకు సంబంధించి పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...రామాంజినేయులు, ఈశ్వరయ్య, ఓబేంద్రలు మద్యం తాగుడు అలవాటును మానేయడం కోసం బొమ్మనహాల్ మండలంలోని ఉంతకల్లు గ్రామంలోగల పాండురంగస్వామి ఆలయంలో ఏకాదశి రోజున వేసే తులసీ మాలను వేసుకోవడానికిగాను ద్విచక్రవాహనంలో బయలుదేరినట్లు తెలిసింది. ఈక్రమంలోనే పట్టణ శివారు ఉండబండ క్రాస్ రోడ్డుకు సమీపంలోని అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బొలేరో (సుజలాన్ గాలిమరల కంపెనీకు చెందిన తమిళనాడు సర్వే బృందం వాహనం) వాహనం, ద్విచక్రవాహనం పరస్పరం బలంగా ఢీకొన్నాయి. దీంతో రామాంజినేయలుకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందగా ఈశ్వరయ్య, ఓబేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఇరువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన యుపీఎస్ సీఐ సురేష్‌బాబు రామాంజినేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వారందరూ నాయి బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారని తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్య, ఓబేంద్ర

# తీపి గుర్తుల సమాధులకు ఆరడుగుల స్థలం కరువైంది

**-ముళ్లకంపల్లో గోరంట్ల హిందువుల శవాలు ఖననం**

**-ప్రజాదర్బార్‌లో టిడిపి నేత కమలాకర్‌రాయల్ మంత్రికి ఫిర్యాదు**



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేత కమలాకర్

**గోరంట్ల, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో లక్షల మంది హిందువులు వున్నా ఎవరికి స్మశానవాటిక కరువైందని మెజార్టీ హిందువుల ఓట్లతో గెలుపొందిన పాలకులు సైతం హిందువు లైన ఆఖరికి ప్రతి హిందు వు తన కుటుంబ సభ్యులు ఎవరైనా మరణిస్తే జీవితకాలం ఆ సమాధులను తీపి గుర్తులుగా గుర్తుంచుకుంటారని అలాంటి హిందూ మనోభావాలు సంబంధించి స్మశానవాటిక లేకపోవడం దారుణమని గోరంట్ల పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో తెలుగుదే శం పార్టీ నాయకులు బాచిపల్లి కమలాకర్‌రాయల్ మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకొస్తూ లిఖితపూర్వక ఫిర్యాదుచేశారు. గత తేదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బికె పార్థసారధి పట్టణ సమీపంలోని ఎముకలగుట్టపల్లికి వెళ్లే దారిలో కొంత భూమిని స్మశానవాటికకు కేటాయించి ప్రహరీగోడ నిర్మాణానికి సైతం భూమిపూజ చేసినట్లు గుర్తు చేశారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి హయాంలో స్మశానాలకు కేటాయించిన భూమి వద్ద జగనన్న కాలనీ మంజూరు చేయడంతో పాటు కేటాయించిన స్మశానవాటిక స్థలంలో గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని చెత్తను ఆ స్థలంలో వేసి డంపింగ్‌యార్డుగా తయారు చేశారని తద్వారా ప్రజలకు ప్రభుత్వ కేటాయించిన గృహాల్లో నివాసముండేందుకు లబ్దిదారులు, మరోపక్క ఆ కంపును భరించలేక ఏ ఒక్కడు అక్కడ శవాలను ఖననం చేయడానికి వెళ్లడంలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా లక్షలాది మంది మనోభావాల సంబంధించిన హిందూ స్మశానవాటికకు స్థలాన్ని కేటాయించి ప్రహరీగోడ మంజూరు చేయాలని అలాగే మండల వ్యాప్తంగా అనేక మేజర్ గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొందని కమలాకర్ మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ వెంటనే తహశీల్దార్‌కు స్థల సేకరణ కోసం ఆదేశాలు జారీ చేస్తామని అతి తక్కువ కాలంలోనే స్థలాన్ని కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# రోడ్డు నిర్మాణాల తనిఖీ

**గుత్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



నిర్మాణం పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం మేరకు పల్లె పండుగ కార్యక్రమం పురస్కరించుకుని చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 12.40 లక్షల అంచనా వ్యయంతో శ్రీపురం గ్రామంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణాలను డిడబ్ల్యుఎంఎ పిడి సలీంబాషా, ఎంపిడిఓ ప్రభాకర్, నాయకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

# కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను కాపాడండి

**- టిడిపి నాయకులు కోడెల చంద్రశేఖర్**



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కోడెల చంద్రశేఖర్

**గుంతకల్లు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

మండలంలోని ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జాచేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోడెలచంద్రశేఖర్ సోమవారం జిల్లాకలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. 2006 నుండి ఇప్పటి వరకు కొందరు గ్రూపులుగా ఏర్పడి తహశీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ సీళ్లు తయారు చేసుకుని పట్టాలుసృష్టిస్తూ పేదలను మోసంచేశారని ఫిర్యాదులోపేర్కొన్నారు. దోనిముక్కల ప్రాంతంలో 548 సర్వేనెంబర్‌లో వున్న వంక పొరంబోకు భూమిని అప్పటి కలెక్టర్ స్మశానవాటికకు కేటాయిస్తే కొందరు జెసిబిలతో చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించారని ఆరోపించారు. అలాగే సర్వేనెంబర్ 820-బిలో వున్న ఎర్రతిమ్మరాయన చెరువు పంచాయతీకి సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించారని పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని రిజర్వాయర్ సైట్లు, రహదారులు ఆక్రమణకు గురయ్యాయని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్ కలెక్టర్‌ను కోరారు.

# ఆదర్శ పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శన

**అగళి, అక్టోబర్ 28 ప్రభాతవార్త**




పారిశ్రామిక సందర్శన చేసిన విద్యార్థినీలు

అగళి ఆదర్శ పాఠశాలలో 9, 10, 11, 12 తరగతుల్లో ఒకేషనల్ కోర్సులో డ్యూటీ అండ్ వెల్‌నెస్ చదువుతున్న విద్యార్థినీలను ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా అగళిలో ఉన్న బ్యూటీ పార్లర్‌ను సందర్శించడం జరిగింది. స్కూళ్లలో థియరీ నేర్చుకున్న విద్యార్థులు ప్రాక్టికల్‌గా వర్క్ గురించి బ్యూటీ పార్లర్‌లో అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా విద్యార్థినీలకు ట్రైనింగ్ ఎక్స్‌పర్మెంట్, అనుభవం, నాలెడ్జ్ అభివృద్ధి చేసుకుంటారు. ఇలాంటి బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సుల వల్ల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కోర్సు అగళి మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఉండటం వల్ల విద్యార్థినీలు వారి భవిష్యత్తుకు పునాది ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్, ఒకేషనల్ కోర్సు బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఉపాధ్యాయురాలు నాగరత్న పాల్గొన్నారు.

